క్లుప్తంగా

రామాలయం నమూనా ప్రదర్శన



ప్రదర్శనగా ఉంచిన రామాలయ నమునా

హిందూపురం: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి పాతూరులో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో రామాలయ నిర్మాణ నమూనా ఏర్పాటు చేశారు. హిందూపురంలోని చేనేత పట్టు చీరల తయారీ కేంద్రమైన ముద్దిరెడ్డిపల్లిలో భక్తుల సహకారంతో త్వరలో శ్రీరామ దేవాలయం నిర్మించాలని సంకల్పం చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఇందుకు ప్రజలు, భక్తుల సహకారం కోసం థర్మాకోల్‌తో రూపొందించిన శ్రీరామాలయ నిర్మాణ నమూనా భక్తులను ఆకట్టుకుంది.

ఘనంగా కల్యాణోత్సవం

హిందూపురం: స్థానిక వాసవీ కల్యాణ మండపంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని బెంగళూరు ఇస్కాన్ హరే కృష్ణ మూమెంట్ వారి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు భక్త వృందదాస్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



వెంకటేశులును పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: జెడ్పీటీసీ అశోక్ తండ్రి డి.సి. వెంకటేశులును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త ఉషశ్రీ చరణ్ శుక్రవారం పరామర్శించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఉషశ్రీ చరణ్ ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని మాజీ ఎంపీపీ వరలక్ష్మిని ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గట్టి మంజు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీప్తి స్కూల్ వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: పట్టణంలోని దీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం రాత్రి 41వ దీప్తియన్ సింపోనియం వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ అలవడినప్పుడే విద్య విజ్ఞానం చేరువవుతాయన్నారు. విద్యార్థుల వేషధారణలతో ఆటపాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్రహం కుట్టి అంకుల్, వైస్ ప్రిన్సిపాల్ లూసి అబ్రహం, డైరెక్టర్ దీపు అబ్రహం, అడ్‌మాస్టర్ షాజీ, కౌన్సిలర్ రమేష్, న్యాయవాది రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీ కొన్న బొలెరో



ప్రమాదానికి గురైన బొలెరో వాహనం

పరిగి (సోమందపల్లి): మండలంలోని నేతలపల్లి వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను బొలెరో వాహనం ఢీ కొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పావగడ ప్రాంతానికి చెందిన రవి బొలెరో వాహనంలో టమోటా లోడుతో కోలార్‌కు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో అదుపు తప్పి వాహనం డివైడర్‌ను ఢీకొనింది. దీంతో వాహన క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. అందులోనే డ్రైవర్ రవి ఇరుక్కుపోయాడు. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెనుకొండ: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే ప్రమాదంపై సమాచారం లేదని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మార్మోగిన గోవింద నామం

- భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు
- ఉత్తర ద్వారాల నుంచి భక్తుల దర్శనం

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారాల నుంచి స్వామి మూలవిరాట్‌లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు మూలవిరాట్‌ను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు విద్యుద్దీపాలంకరణలో మెరిశాయి.
–సాక్షి నెట్ వర్క్:

» హిందూపురంలోని పేటవెంకట రమణస్వామి ఆలయంలో తెల్లవారు జామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయం వద్ద నుంచి చిన్న మార్కెట్ బెంగళూరు రోడ్డు వరకు బారులు తీరారు. స్థానిక శ్రీనివాస మందిరం వద్ద వెంకటేశ్వరస్వామి దర్శించుకోవడానికి రోడ్డుపై భక్తులు బారులు తీరారు. అలాగే ముక్కిడిపేటలోని నిత్య కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎంఎఫ్‌రోడ్డులోని హైవగ్రీవ స్వామి ఆలయం, ఆర్‌పీజీటీ రోడ్డులోని బాలాజీ ఆలయం, లక్ష్మీపురంలోని వేంకటేశ్వరాలయం, రైల్వేరోడ్డులోని పద్మానాభ స్వామి, గుడ్డం రంగనాథస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

» లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంలో వెలసిన రఘునాథస్వామి, పాత లేపాక్షిలోని తిరుమల దేవరప్పస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

» మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ మండలాలతోపాటు పావగడ పట్టణంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి.

పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ నియోజకవర్గంలోని పెనుకొండ, గోరంట్ల, సోమందేపల్లి, పరిగి, రొద్దం మండలాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిగి, సోమందేపల్లి, రొద్దం మండలాల్లో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, నరసింహమూర్తి, శ్రీనివాసులు, తిమ్మయ్య, జెడ్పీటీసీ అశోక్, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రమాకాంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో పేట వేంకటరమణ స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా బారులు తీరిన భక్తులు



పరిగిలో పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



హిందూపురంలో ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



లేపాక్షిలో రఘునాథస్వామి



లేపాక్షిలో దుర్గాదేవి



అమరాపురంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



రొళ్ల మండలం కొత్తపాళ్యంలో..



పెనుకొండలో వెంకటేశ్వర స్వామి



అగళిలో రంగనాథ స్వామి



గుడిబండలో పూజలందుకున్న వేంకటేశ్వరుడు



మడకశిరలో షిరిడీ సాయిబాబా ఆలయ ద్వారాన్ని అలంకరించిన దృశ్యం



పావగడ: అలంకరణలో వేంకటేశ్వరస్వామి



సోమందేపల్లిలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



మడకశిర నుంచి కొత్త పాళ్యం వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు



మడకశిర మండలం నీలకంఠాపురంలో భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

నిధుల వినియోగంలో జాప్యమెందుకు?



అధికారులను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ నరసింహ మూర్తి

మడకశిర: మడకశిర మండల ప్రజా పరిషత్‌కు సంబంధించిన నిధులను వినియోగించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని వైస్ ఎంపీపీ నరసింహమూర్తి అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీపీ కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల గ్రాంట్‌కు సంబంధించిన నిధులపై తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. వైస్ ఎంపీపీ నరసింహమూర్తి మాట్లాడుతూ.. మండల గ్రాంట్ రూ.1.40 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నిధులను ఇంత వరకు అభివృద్ధి పనులకు ఎందుకు వినియోగించలేదని ధ్వజమెత్తారు. ఈ నిధులను ఎంపీటీసీల ఆధ్వర్యంలోనే అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు సంబంధం లేకుండా ఈ నిధులను కేటాయించాలన్నారు. శాఖల వారీగా ప్రభుత్వ సబ్సిడీ పథకాలు తదితర అంశాలపై చర్చించారు. పలువురు సభ్యులు తమ సమస్యలను వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ కవిత మాట్లాడుతూ అధికారులు సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సోనిబాయి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహం, ఏఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

'నగర పంచాయతీ' ఎదుట మున్సిపల్ కార్మికుల రిలేదీక్షలు



మాట్లాడుతున్న బాబావలి

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ కార్యాలయం ముందు నగర పంచాయతీ కార్మికులు శుక్రవారం రిలేదీక్షలు చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బాబావలి అధ్యక్షతన దీక్షలు చేపట్టారు. మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి మాట్లాడారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు 17 రోజుల సమ్మె సందర్భంగా హామీల జీఓలను ఇచ్చి, అమలు చేయలేదన్నారు. వెంటనే అమలు చేయాలన్నారు.

స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోండి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిర: విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సేజాత, మహేష్ సూచించారు. శుక్రవారం కళాశాలలోని సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచి మార్కులు సాధించడానికి స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇంటర్‌బోర్డు అధికారులు సబ్జెక్టుల వారీగా ఈ స్టడీ మెటీరియల్ తయారు చేసి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు.

పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టి, అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ తాలుకా కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాలు కేటాయించి, ప్రభుత్వం రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇస్మాయిల్, బాబు, రవికుమార్, మారుతి రెడ్డి, చలపతి, కమల్, లక్ష్మీనారాయణ, సాబీరా, ముంతాజ్, నౌషాద్, లింగప్ప, చాంద్ బాషా, శివ పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండలంలో ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా వ్యవసాయ రైతు సంఘం సహాయ కార్యదర్శి గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సీపీఐ నేతలతో కలిసి సీనియర్ అసిస్టెంట్ నేలకోటప్పకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. నాయకులు జయచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, గోపాల్ , ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ శ్రీధర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా ఇల్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, పల్లె ప్రాంతాల్లో మూడు సెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడిగా వాసిమ్ బేగ్

మడకశిర: ముస్లిం ఐక్యవేదిక మడకశిర నియోజకవర్గ అధ్యక్షుడిగా మడకశిరకు చెందిన వాసిమ్‌బేగ్‌ను నియమించినట్లు ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వాకిమ్‌బేగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించినందుకు ఐద్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్‌సయ్యద్, జిల్లా అధ్యక్షుడు గౌస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'అంగన్‌వాడీ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి'



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: అర్హులైన హెల్పర్లకు అంగన్‌వాడీ టీచర్లుగా ప్రమోషన్లు ఇచ్చిన తర్వాత అంగన్‌వాడీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్ట్ కార్యదర్శి శోభమ్మ, అధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ ఇప్పటికే గత 10, 15 సంవత్సరాల నుంచి హెల్పర్స్, టీచర్ ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రమోషన్లు ఇవ్వకుండా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో భారతి, నాగమ్మ, జయమ్మ, ఆశ, తహసీన్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

సోమందపల్లి: మండల కేంద్రంలోని ఈద్గా మైదానం ఎదురుగా జాతీయ రహదారిపై ఓ కారు బోల్తాపడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి నలుగురు వ్యక్తులు మంత్రాలయానికి వెళ్తుండగా అదుపుతప్పి వాహనం రోడ్డుపై బోల్తాపడింది. స్థానికులు కారులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీశారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పెనుకొండ ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె ఓ ప్రకటనలో పెనుకొండ, రొద్దం మండలాల పరిధిలో ఖాళీలను తెలియజేశారు. రొద్దంలో చెరుకూరు అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు బీసీ–బీ, రోస్టర్ పాయింట్ 24, మినీ అంగన్‌వాడీ కార్యకర్త బూచెర్ల ఓసీ, రోస్టర్ పాయింట్‌లు 28, అంగన్‌వాడీ హెల్పర్ రొద్దం –2 బీసీ–బీ, రోస్టర్ పాయింట్లు 81, మోసర్లపల్లి ఓసీ, రోస్టర్ పాయింట్‌లు 92, ఆర్. కొట్టాల బీసీ–డి రోస్టర్ 93, తోటగేరి పెనుకొండలో బీసీ–ఈ, రోస్టర్ 94, వుండాలన్నారు. 10వ తేదీ నుంచి జనవరి 25 సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అమరాపురం: గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ శాంతలక్ష్మి కోరారు. అమరాపురం మండలంలోని కె.గొల్లహట్టి (ఓసీ), కనకనపల్లి (బీసీ–ఏ), గుడిబండ మండలంలోని మోరుబాగల్–2లో (ఓసీ), తిమ్మాలపురం (పీహెచ్)కు రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే మహిళలు, వివాహితులై ఉండాలన్నారు. స్థానికంగా నివాసం ఉండాలని పేర్కొన్నారు. 21 సంవత్సరాల వయస్సు నిండి, 35 సంవత్సరాల్లోపు ఉండాలని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన మహిళలు ఈనెల 25వ తేదీలోపు అయా గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

పార్టీని మరింత బలోపేతం చేయండి



తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసిన నియోజవర్గ నాయకుడు వేణురెడ్డి తదితరులు

హిందూపురం: హిందూపురం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీని మరింత బలోపేతానికి కృషిచేయాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం తిరుపతిలో ఆయన నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రణయ్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా అధికారపార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించడం, నియోజకవర్గ సమస్యలను రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అధికారపార్టీ చేస్తున్న అరాచకాలు, కేసులకు ఏమాత్రం భయపడవద్దని పార్టీ అండగా నిలుస్తుందని నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇవ్వాలన్నారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వం చేస్తున్న దాడులు, అన్యాయాలు ప్రజావ్యతిరేక కార్యక్రమాలు అన్ని గమనిస్తున్నారని సరైన బుద్ధి చేప్పేసమయం వస్తుందన్నారు. అందరూ కలిసికట్టుగా ఉంటూ ముందుకు సాగాలని తెలియజేశారన్నారు.

విద్యార్థులపై ఒత్తిడితేవద్దు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: చిన్నారులపై చదువుల ఒత్తిడి తీసుకురావొద్దని, ఆటపాటలతో విద్యపై మక్కువ పెరిగేలా చూడాలని మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి సూచించారు. స్థానిక ఎంజీఎం గ్రౌండ్‌లో విద్య వృక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రీ ప్రైమరీ యానువల్ స్పోర్ట్సు డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా పిల్లలు వివిధ రకాల ఆటపాటలు, క్రీడాలతో అలరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజగోపాల్, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

హిందూపురం టౌన్: పట్టణంలోని వేణువిద్యావిహార్ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ బహుమతులను ప్రదానం చేశారు.

గోకులం షెడ్లు ప్రారంభం

అమరాపురం: మండలంలోని పుల్లీకుంట, నగోనపల్లి గ్రామంలో నూతనంగా రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లను ఎంపీడీఓ రామరావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద 80 శాతం సబ్సిడీతో గోకులం షెడ్లను నిర్మించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జేవీవీ క్యాలెండర్ల ఆవిష్కరణ

హిందూపురం: పట్టణంలోని చైతన్య నగర్‌లో ఉన్న పీపుల్స్ క్లినిక్‌లో జేవీవీ ఆధ్వర్యంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటీ రాంమూర్తి, కార్యదర్శి రామకష్ణ, అధ్యక్షులు శ్రీనివాసులు, అతావుల్లా, మురళీమోహన్, ఉగ్రప్ప, గంగిరెడ్డి, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు శిక్షణ

హిందూపురం టౌన్: మండలంలోని సి.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ కోర్సులో భాగంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. సంక్రాంతి సెలవుల్లో భాగంగా 10 రోజుల పాటు వర్క్ ఇంటర్‌షిప్‌ను అప్పరల్స్ ట్రేడ్‌పై ప్రారంభించామని ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు. ఉపాధి అవకాశాలు మెరుగు పరచడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఒకేషనల్ ట్రైనర్ సుబ్రమణ్యం విద్యార్థులకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైనింగ్‌పై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.